# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

## ధరణిని ఎత్తేస్తే కొట్లాటలు.. కేసులే!

### రైతులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి

- పాస్ పుస్తకాల్లో పట్టాదారు ఒకరు, కబ్జాదారు మరొకరుగా నమోదు
- నాడు మాన్యువల్ పహాణీ పేరుతో పైరవీ కారులదే రాజ్యం
- నాటి సాఫ్ట్‌వేర్ వెబ్ ల్యాండ్‌లోని డేటాను ఆపరేటర్లు మార్చే అవకాశం
- రిజిస్ట్రేషన్ అయిన భూమికి పాస్ పుస్తకాలు ఇచ్చేందుకు నెలల తరబడి సమయం
- నేడు ధరణితో పది నిమిషాల్లో పట్టా.. పోర్టల్‌లో పట్టాదారు కాలమే ఫైనల్

క్షేత్రస్థాయిలో భూమి అనుభవదారు ఒకరు.. రికార్డుల్లో పట్టాదారు మరొకరు.. కబ్జాదారు ఇంకొకరు. పహాణీ కథ ఒకటి.. ఆర్వోఆర్ కథ ఇంకొకటి.. ఇది నాటి రెవెన్యూ రికార్డుల పరిస్థితి. వీఆర్వో మారిండంటే కబ్జా కాలంలో పేర్ల మార్పులు..పాస్ పుస్తకాల్లో భూమి హెచ్చుతగ్గులు..ఎకరికి డబ్బు లేదా పలుకుబడి ఉంటే రికార్డుల్లో వారిదే ఆధిపత్యం. ఫలితంగా భూమి తమదంటే తమదని పోలీస్ స్టేషన్‌లో గొడవలు.. కోర్టుల్లో దావా(కేసు)లు. రెవెన్యూ అధికారికి తెలియకుండానే వెబ్ ల్యాండ్ వెబ్‌సైట్‌ను ఆపరేటరే మార్చే అవకాశం ఉందంటే ఆ రికార్డుల పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. ఇలాంటి రికార్డులను ప్రక్షాళన చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ రికార్డులపై తాసీల్దార్‌కు మాత్రమే పూర్తి అవకాశం కల్పిస్తూ పది నిమిషాల్లో భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా ధరణినిని తీసుకొచ్చింది. దాంతో వివాదాలు లేకుండా రైతులు తమ భూములపై హక్కులు పొందుతున్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని, ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొచ్చి మళ్లీ పాత పద్ధతే అమలు చేస్తామని పార్టీ నాయకులు చెప్పడం రైతులకు ఆందోళన కలిగిస్తున్నది.

– నల్లగొండ, నవంబర్ 21

### నాటి పహాణీలో 32 కాలమ్స్

పహాణీ భూమి వివరాలతో కూడిన ప్రధాన రికార్డు. ఇందులో ఏ గ్రామం.. ఏ సర్వే నంబర్.. ఏ రైతు భూమి ఎక్కడ ఉంది అనే వివరాలు ఉంటాయి. అలాంటి రికార్డుల్లో 32 కాలమ్స్ ఉండేవి. పహాణీలో పట్టాదారు కాలంతో పాటు కబ్జాదారు, వ్యవసాయానికి యోగ్యమా..కాదా, భూమి శిస్తు ఉందా? లేదా? లాంటి అంశాలతో అనేక అనవసరమైన కాలమ్స్ కలిపి 32 ఉండేవి. దాంతో భూమి పట్టా ఒకరి పేరు మీద.. కబ్జా మరొకరి పేరుమీద ఉండేది. వీఆర్వో మారిండంటే చాలు డబ్బులకో లేదా అధికార బలానికో ఆ రికార్డుల్లో మార్పులు చేర్పులు జరిగేవి. అంటే రికార్డులు అధికారులను బట్టి మారుతుండేవి. రెవెన్యూ అధికారిక వెబ్‌సైట్ అయిన వెబ్‌ల్యాండ్‌లో అన్ని భూముల వివరాలు, పట్టాదారుల వివరాలు నమోదు చేస్తుండగా ఆ వెబ్‌లాండ్‌లో భూమి ఎక్కువ లేదా తక్కువ వంటివి ఆపరేటర్ కూడా మార్చే చేసే అవకాశం ఉందంటే ఆ వెబ్‌సైట్ ఎంత వెసులుబాటో అర్థమైతుంది.

### రిజిస్ట్రేషన్ చేసుకున్నా భూ మార్పిడికి కష్టాలు

ధరణి అమలుకు ముందు భూమి రిజిస్ట్రేషన్లు ఆఫీసుల్లో చేసుకుంటుండగా పాస్ పుస్తకాలు మాత్రం రెవెన్యూ అధికారులు ఇచ్చేవారు. రిజిస్ట్రేషన్ అనంతరం వీఆర్వోకు డాక్యుమెంట్స్ ఇచ్చి మ్యూటేషన్ చేసి పాస్ పుస్తకాలు ఇవ్వమంటే నెలల తరబడి కొందరైతే ఏండ్ల తరబడి తిప్పించుకునేవారు. ఆ తర్వాతైనా చేయి తడపనిదే పుస్తకమిచ్చేది కాదు. దానికి తోడు పహాణీల్లో పట్టాదారు, కబ్జాదారు కాలంలో పాత పేర్లే పునరావృతం అయ్యేవి. దాంతో పట్టాదారు ఒకరు, కొన్నది మరొకరు, కబ్జాదారు ఇంకొకరు. ఈ వివాదం పరిష్కరించుకునేందుకు పోలీస్ స్టేషన్లు, కోర్టు చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి ఉండేది. వీఆర్వోలకు అవగాహన లేక రికార్డులు అప్‌డేట్ చేయకపోవడం వల్ల కూడా భూ తగాదాలు జరిగేవి.

### ధరణితో పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్, మ్యూటేషన్..

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో భూమిని పది నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేసి మ్యూటేషన్ చేసి పాస్ పుస్తకాలు ఇస్తున్నారు. ఇది కూడా తాసీల్దార్ పరిధిలోనే ఉండడంతో అమ్మకందారు పాస్ పుస్తకం ఆధారంగా భూమి వివరాలు ధరణి వెబ్‌సైట్‌లో చూసి రిజిస్ట్రేషన్ అనంతరం అమ్మిన వ్యక్తి పుస్తకం నుంచి ఆ భూమి తొలగించి కొన్న వ్యక్తి పేరుతో నమోదు చేసి కొత్త పుస్తకం ఇస్తున్నారు. ఇది కూడా పది నిమిషాల్లోనే పూర్తవుతున్నది. వీఆర్వోలతో పని లేకపోవడం..రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు పోవడం వంటి బాధలు తప్పడంతో సమయం, డబ్బులు ఆదా అవుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ధరణి ఎత్తేస్తే దళారీల రాజ్యమే



సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి. వారి సమస్యల మీద పూర్తి అవగాహన ఉంది. అందుకే రైతు బంధు, రుణ మాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువుల సరఫరాతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పండిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నారు. రైతుల భూములను ధరణిలో పొందుపరుచడంతో వారి ఖాతాల్లో రైతు బంధు జమ అవుతున్నది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సరాసరి రైతులకే లబ్ధి కలుగుతున్నది. ధరణితో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థ, వీఆర్ఓ వ్యవస్థలు ఉన్న సమయంలో రికార్డుల్లో చాలా అవకతవకలు జరిగేవి. వాటిని సరి చేసుకోవడానికి ఆఫీసుల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. కాంగ్రెస్ నాయకులు ధరణిని తీసేసి మళ్లీ పాత వ్యవస్థలను తీసుకురావాలని చూడడం మంచిది కాదు. ధరణి వ్యవస్థను ఎత్తేస్తే తిరిగి దళారుల రాజ్యం వచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే రైతులు గోస పడడం ఖాయం. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే మరింత మేలు కలుగుతుంది.

– ఎర్రగొర్ల సురేశ్, రైతు, రేవూరు గ్రామం, మేళ్లచెర్వు మండలం

### మళ్లీ మమ్మల్ని కష్టాల్లోకి నెట్టి వేయడమే



ధరణి పోర్టల్ లేక ముందు నాలాంటి రైతులు ఎంతో మంది దగా పడ్డారు. గతంలో పటేల్ పట్వారీ వ్యవస్థ కాలంలో డబ్బులకు ఆశపడి దొంగ రిజిస్ట్రేషన్లు చేసింర్రు. దాంతో ఎందరో రైతుల జీవితాలు ఆగమైనయ్. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగా కేసీఆర్ రైతు కాబట్టే ఏ రైతుకూ అన్యాయం జరగకూడదనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ తెచ్చారు. ఏ అధికారితో సంబంధం లేకుండా రైతులకే అవకాశం కల్పించి ఎవరి భూమి వారి రక్షణలోనే ఉంది. మేం సొంత నిర్ణయంతో భూములను అమ్ముకుంటే తప్పా పట్టా పాస్ పుస్తకాలను మార్చే అధికారం ఏ అధికారికి లేకుండా చేశారు. కానీ తాము అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామని కాంగ్రెస్ వాళ్లు అనడం అన్యాయమే. మళ్లీ మమ్మల్ని కష్టాల్లోకి నెట్టి వేయడమే. వాళ్లు వస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. పంచాయితీలు, గొడవలు మొదలవుతాయి. అమాయక రైతులు మోసపోవాల్సి వస్తుంది. గతంలో చెప్పులు అరిగేలా తిరిగినా పనులు కాకపోయేవి. కానీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్న ధరణిని తీసేస్తామన్న కాంగ్రెస్ వాళ్ల పద్ధతితో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఒక్కసారి ధరణిలో భూమి ఎక్కిందంటే ఆ రికార్డులను మార్చేందుకు రెవెన్యూ వాళ్లకు కూడా చాన్స్ లేకుండా చేసిండు కేసీఆర్ సార్. నా ఓటు బీఆర్ఎస్‌కే.

– గోసుల విజయ్‌కుమార్, బొల్లంపల్లి, జాజిరెడ్డిగూడెం మండలం

### కాంగ్రెస్ సర్కార్ వస్తే రైతులకు తిప్పలు మళ్లీ షురూ



కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తమంటున్నరు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రైతుల గోస తగ్గింది. ఒకే దగ్గర రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అయిపోతున్నది. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుడు తిప్పల తప్పింది. గతంలో రైతులు రిజిస్ట్రేషన్ ఆఫీసుల వెంబడి, వీఆర్ఓలు, పట్వారీల వెంట తిరగాల్సిన పరిస్థితి ఉండేది. అయినా పని కాకపోయేది. ఇప్పుడు కేసీఆర్ సారు సీఎం అయినంక రైతుల అవస్థలు పోయినవి. ఏవరికీ పైసా లంచం ఇవ్వకుండా పని అయితుంది. కాంగ్రెస్ సర్కారు వస్తే రైతుల తిప్పలు మళ్లా షురూ అవుతాయి. పటేల్, పట్వారీ వ్యవస్థ తెస్తామంటున్నారు. రైతులు బ్రోకర్ల వెంబడి, పటేల్, పట్వారీల వెంబడి తిరిగి లంచాలు ఇవ్వాల్సి వస్తుంది. ఇప్పుడు ఆ వ్యవస్థ ఎందుకు. వారితో ఏం పని. సక్కగ నడుస్తున్న పనిని కుంటుపడనీయడానికే కాంగ్రెస్ పార్టీ చూస్తున్నది. రైతు ప్రభుత్వమైన బీఆర్ఎస్‌కు మద్ధతుగా రైతులు నిలుస్తారు.

– శానం రామలింగయ్య, బక్కయ్య గూడెం గ్రామం, నేరేడుచర్ల మండలం

### ధరణిని కాపాడుకునేందుకు కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి



ధరణి పోర్టల్‌ను తొలగిస్తే మళ్లీ పాత రోజులే. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన ధరణితో నేడు రైతులంతా దర్జాగా ఉన్నారు. రైతుల సంతోషాన్ని చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ రెవెన్యూ రికార్డులో కౌలుదారు, అనుభవదారు కాలాలు పెడతామని అంటున్నది. కాంగ్రెస్ ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తెస్తే భూ సమస్యలు పెరిగి భూమిపైన రైతులు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. మళ్లీ వెనకటి లెక్క అధికారుల చుట్టూ తిరుగుతూ లంచాలు ఇవ్వాలి. అది రైతులకు ఏమాత్రం మంచిది కాదు. నేడు ధరణితో పైసా ఖర్చు లేకుండా, లంచం, దళారుల ప్రమేయం లేకుండా ఒక్క రోజులోనే భూముల పట్టాలవుతున్నాయి. ధరణిని కాపాడుకునేందుకు కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి.

– పశ్య లక్ష్మీనారాయణరెడ్డి, రైతు, హుజూర్‌నగర్

### పట్వారీ వ్యవస్థ మళ్లీ వస్తే రైతులు ఇబ్బందులు పడతరు



పట్వారీ వ్యవస్థ మళ్లీ వస్తే రైతులు ఇబ్బందులు పడతరు. వీఆర్వోలు, ఎమ్మార్వోలు పెట్టె లింకులతో రైతులు పొద్దస్తమానం వారి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తది. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వో వ్యసస్థను రద్దు చేసి ధరణిని ప్రవేశపెట్టింది. ఇప్పుడు రైతు వేలిముద్రతో గంటలోనే కార్యాలయంలో పని అయిపోతుంది. మీ సేవలో ధరఖాస్తు చేసుకుని అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. భూమి బదలాయింపు కష్టాలు తొలగడంతో రైతులు ఆనందంగా ఉన్నరు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణీని రద్దు చేస్తాననడం మూర్ఖపు చర్య. దాన్ని రాష్ట్ర రైతాంగం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. అధికారంలోకి రావడానికి రైతులకు అన్యాయం చేస్తే కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుంటుంది. అందరికీ ఆమోద యోగ్యమైన ధరణీనే అందుబాటులో ఉండాలి.

– మద్ది ధన్వంతరెడ్డి, రైతు, చనుపల్లి, అనంతగిరి మండలం

### భూముల రిజిస్ట్రేషన్లకు ధరణి అద్భుతం



నాడు భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రోజుల తరబడి అధికారుల చుట్టూ తిరిగే వాళ్లం ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని తాసీల్దార్ కార్యాలయం దగ్గరకు వెళ్తే నిమిషంలో రిజిస్ట్రేషన్ అవుతుంది. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణి అద్భుతం. మళ్లీ పట్వారీ వ్యవస్థ వస్తే రైతులకు గోస మొదలైనట్లే. రేవంత్‌రెడ్డి ధరణిపై అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటు.

– వెంపల్ల నర్సిరెడ్డి, బొడ్డుగూడెం, అడ్డగూడూరు మండలం

